నీడపట్టు మనిషి

"మీకు మనియార్డరు వచ్చింది. పోస్టుమాన్ మళ్ళీ వస్తానన్నాడు. ఎక్కడికీ వెళ్ళకండి."

వారంరోజులుగా అతనిముందు మూగపిల్లలా కదిలి, కేవలం పరదాలు చించుకున్న ఘోషా చూపులతో సిగ్గుగా, రహస్యంగా, ఉత్సుకతతో పక్కల నించి, కిటికీలవెనకనించి వింతగా ప్రతికదలికని పరిశీలించే నాగావళి, ప్రాణం పోసుకున్న విగ్రహంలా మొదటిసారిగా అతని ఎదుట బిగదీసుకుపోయిన పెదాల్ని మెల్లగా కదిల్చి, ఆ వెంటనే తన ప్రమేయం లేకుండా ఆజ్ఞాపించ గలిగిన తన కంఠాన్ని గుర్తుపట్టి, సిగ్గుపడి అతని ఎదుట వుండలేక లోపలికి వెళ్ళిపోయింది.

సదానంద జోళ్లు తొడుక్కోబోతున్న వాడల్లా మానేసి వెనక్కు తిరిగి చూస్తే నాగావళి కదిల్చిన గాలిఅలలకు ఎగిరిన దుమ్ము అటూ యిటూ కదుల్తోంది.

వెనక్కు తిరిగొచ్చి గదిలో కూర్చున్నాడు.

గదిలో ఏమీ తోచడంలేదు. ఒంటరితనమూ, నిశ్శబ్దమూతప్ప తన కొరకు ఆగదిలో కాలక్షేపానికి వీలుగా ఏమీలేవు. కూనిరాగాలు తీసుకో డానికి కొత్తప్రదేశంలోని బెరుకూ, స్వేచ్ఛగా కదలడానికి యింకా అలవాటు పడని మనుషులూ, వాళ్ళ పొడిపొడి పలకరింపులూ అతన్ని దిగ్బంధనం చేసేశాయి.

ఉద్యోగానికని వచ్చి వారంరోజు లయ్యింది. నాగావళి తండ్రి రాఘవ రావుగారు రమ్మంటే వచ్చాడు. ఆయన బహు తెలివైనవాడు. ఓ పెళ్ళిలో కలిసిన సదానంద తల్లిని ముందుచూపుతో పలకరించి, అబ్బాయిని తన

దగ్గరకు పంపిస్తే ఉద్యోగం వేయిస్తాననీ, తనదగ్గరే వుండే ఏర్పాటు చేస్తాననీ మాట యిచ్చాడు. ఆయనదయింట్లో ఎదిగినకూతురు వుందన్న సంగతి బంధువు లందరికీ తెలుసు. అమ్మాయి బంగారపుబొమ్మే. బంగారపు బొమ్మ ఒంటి మీది బంగారాన్ని వొలిస్తే ఎన్ని తులాలు తూగుతుందా అన్న ఆలోచన తప్ప మరో ఆలోచనలేని మనుషుల్ని చూసేసరికి రాఘవరావుగారికి కంగారుపుట్టి ఇత రత్రా ప్రయత్నాలు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు.

అలాంటి ప్రయత్నమే సదానందను రప్పించుకుని ఉద్యోగం వేయిస్తా ననడం. ఇందుకు సందానంద అంగీకరించాడని తెలిసిన బంధువులు అతన్ని, గేలానికి తగులుకోబోతున్న చేపను చూసినట్టు చూసి జాలిపడ్డారు.

పెళ్ళిపందిట్లో చలాకీగా అటూయిటూ కదిలి చిరుగాలుల్నీ, చిరు నవ్వుల సౌరభాల్నీ చల్లుకుని, అందరి చూపుల్నీ తనవైపు తిప్పుకోగలిగిన నాగావళినిచూసి 'ఇల్లాంటి అమ్మాయి తనకు యిల్లాలైతే బాగుండును' అను కున్నాడు సదానంద. ఆ తర్వాత ఆ అమ్మాయి తండ్రి రాఘవరావుగారు ఉద్యోగం వేయిస్తానంటే వరిగెత్తుకొచ్చాడు. చేతిలో డబ్బు లేకపోతే అందిన తర్వాత మనియార్డరు చెయ్యమని యింట్లో చెప్పి వెంటనే బయలుదేరి వచ్చేశాడు.

వచ్చి వారం రోజులయ్యింది. రాఘవరావుగారు ఉద్యోగ ప్రయత్నా లైతే చేస్తున్నారు. కోపరేటివ్ సబ్ రజిస్ట్రారు ఆయన. పలుకుబడి వున్నవాడే. పదిరాళ్లు వెనకేయాలన్నా చేతగాలేదు. రోగిష్టిభార్యా, మంచంలోంచి లేవలేని ముసలితల్లీ, కాలేజీచదువుకు తనమీదే ఆధారపడిన తమ్ముడికొడుకూ, అడపా దడపా నాగావళీ, అతని జీతాన్ని పంచుకుని, ఏ లాటరీయో తగిలితేనే తప్ప లేకపోతే తమది మిగులులేని సంసారమే అని నిరూపించారు.

ఈ వారం రోజులూ నాగావళి, చూపుల్తోనే తృప్తిపడుతూ వచ్చింది. ఇవ్వాళే పలకరించింది. అది పలకరింపులా అనిపించలేదు అతనికి. ఓ నిముషం అలానే నిలుచుని, దయదలచి దానం చేసినట్టు యింత పిసరు చిరు నవ్వును తనముందు పడేసి, కనురెప్పల పరదాల్ని ఎత్తి పట్టుకుని మరికాస్సేపు ఆ వెనక నర్తకిని నాట్యం చేయించి, కంఠంలో యింకాస్త శ్రద్ధతో శృతులు

సరిచేసుకుని మంద్రస్థాయిలో "మనియార్డరు వచ్చింది మీకు, పోస్టుమేన్ మళ్ళీ వస్తానన్నాడు. కాస్సేపు కూచోండి" అని పలకరించి. కొద్దిసేపు అక్కడే నిలిచి, కృతజ్ఞతలు చెప్పుకునే తన చూపుల్ని కూడా అందుకుని, సిగ్గుతో అలవోకగా తలవంచుకుని. జారని పపిటను సర్దుకుని, అంతలోకే ఆమెచుట్టూ ఎగురుతున్న చూపుల తుమ్మెదల రెక్కలకింద కదిలిన చిరుగాలులకు పులకరించి, చటుక్కున తనఎదుటనించి తప్పుకునిపోయివుంటే ఎంత బావుండును! ఇంత పొయిటిక్‌గా ప్రవర్తిస్తే ప్రతి సంఘటననీ ఓ కావ్యంగా సృష్టించగలదు స్త్రీ! ఎదుటి జీవితాలను రసాత్మకం చెయ్యగలదు— అనుకున్నాడు అతను.

గదిలో ఏమీ తోచలేదు. ఈ ఏకాంతాన్ని తగలెయ్యడానికి సిగరెట్లు కూడా లేవు. పొద్దున్నే అయిపోయాయి. మూడు ఫర్లాంగులు వెళ్ళాలి. ఆ యింట్లో సాహిత్యాన్ని మోసే బీరువాలైనా ఎక్కడా కనిపించలేదు. ఇంచుమించు యిల్లంతా చూశాడు ఒక్క గది తప్ప. ఆగదిని నాగావళి వాడుతోంది. ఏమన్నా వుంటే - అందులో వుండాలి. పిలిచి అడగాలనిపించింది గాని ఏమని పిలవాలి? పేరెట్టి పిలిచేంత చనువేర్పడలేదు. ఉత్తరోత్రా అర్ధాంగి అయ్యే అవకాశాలున్న ఆమెను తెలిసి తెలిసి 'ఏమండీ' అని ఎలా పిలవడం? అలాంటిదేమీ లేకుండా అతితెలివిగా 'చదువుకునే పుస్తకాలేమైనా వున్నాయా?' అని అడగడానికి ఎప్పుడైనా ఆమె అతనిముందుకొస్తేగా.

చాలా ఇబ్బందిగా ముళ్ళమీద కూర్చున్నట్టు ఆ గదిలో కూర్చున్నాడు సదానంద. అరగంటసేపు అలానే కూర్చుని తన సహనాన్ని తనే పరీక్షించుకున్నాడు. ఇక చేతకాలేదు. వీధి వరండాలోకి వద్దామని రాబోతుంటే నట్టింట్లో కూర్చుని కూనిరాగంతీస్తున్న నాగావళి అతన్ని చూసి చటుక్కున ఆపేసింది. అల్లాంటి పరిస్థితికి బాధ్యుడయినందుకు కాస్తంత తత్తరపడి మళ్ళీ గదిలోకి తిరిగి వెళ్ళిపోయాడు.

రాగం బాగానే తీస్తోంది. పాటలు బాగా పాడే సామర్థ్యంవుందో! లేక ఉత్సాహంకొద్దీ కూనిరాగాలతోనే సరిపుచ్చుకుంటోందో మరి. మళ్ళీ కంఠం కదిపితే విందామని అతిశ్రద్ధగా తలుపు దగ్గర్లోనే తచ్చాడుతూ నిలుచున్నాడు గాని ఆమె అక్కడున్న అలికిడే వినిపించలేదు.

పావుగంటసేపు గదిలోనే వుండి, బయటికొచ్చాడు. నాగావళి నట్టింట్లోనే వుంది; తలగడ గలీబుకు పూలుకుడుతోంది. అలికిడి విని తలెత్తి చూసింది.

"ఇంట్లో ఏమయినా పుస్తకాలు వున్నాయా?"

"ఏం పుస్తకాలండీ?"

'ఏవైనా సరే. ఇంగ్లీషువైనా, తెలుగువైనా నవలలుంటే యివ్వండి. కాలక్షే.... '' చటుక్కున ఆపేసి తనలో తానే నవ్వుకున్నాడు. ఓ పొడిదగ్గు దగ్గి కంఠం సవరించుకుని—

"కాలక్షేపానికి ఏవయినా సరే. నాకు పుస్తకాలు చదివే పిచ్చి ఎక్కువే. నవలలు లేకపోయినా వారపత్రికలన్నా వుంటే యివ్వు" అన్నాడు.

నవ్వుతోంది ఆమె. ఏ చెరువు మీదనో, ఏ పున్నాగచెట్టుకిందనో విడిపోయి తప్పించుకొని వచ్చిన చల్లటి పిల్లగాలితెర ఒకటి గర్భగుడిలో కదలక అతినిశ్చలంగా వెలిగే ఆముదపు దీపం జ్యోతిని అరక్షణం అలా కాస్తంత కదిల్చినట్టుగా పెదాల్ని కదిపీ కదపనట్టు అతిసుతారంగా, మరీ నాజూగ్గా కదిలే అతిపల్చని చిరునవ్వు నవ్వి "సాయంకాలం తెచ్చిపెడతాలెండి. ఇంట్లో అయితే లేవు. ఓ స్నేహితురాల్ని అడిగి పట్టుకొస్తాను. దానిదగ్గర పెద్ద లైబ్రరీయే వుంది" అంది.

''సరే లెండి." అని చెప్పి మళ్ళీ గదిలోకి వెళ్ళిపోయాడు. ఇప్పుడు ఏకాంతం అనిపించడం లేదు. ఇంతకు మునుపే గబగబా ఏరుకుని మనసులో దాచేసుకున్న నాగావళి రూపచిత్రాల్ని జ్ఞాపకాల భూతద్దాలకింద పెట్టి పెద్దవిగా పెంచుకుని చూస్తూ కూచున్నాడు. అప్పుడప్పుడు అభిరుచుల రంగులు కూడా అద్ది భవిష్యత్ తెరమీదకు ప్రొజెక్టుచేసి, దూరంగా నిలుచుని మరీ వివరంగా, స్పష్టంగా కనిపించే ఆ చిత్రాల్ని చూసి ఆనందం భరించలేక హృదయాన్ని మీటుకుని తనలోతానే పాట పాడుకున్నాడు.

ఎంతసేపు అయ్యిందో, బయటనుంచి పిలుపు వినిపిస్తే కూనిరాగం కట్టేసి, పోస్టుమేన్ వచ్చాడేమోనని కంగారుగా తలుపులు తీసుకుని బయటికి వచ్చాడు. ఎదురుగా నాగావళి! చేతిలో పుస్తకాల దొంతర-అంత ఎండలోనూ వెళ్ళొచ్చినట్టు ఎర్రగా కందిపోయిన ముఖంతో; చేతిలో బరువుకు ఊపిరి

బిగబెట్టి ఒక్కసారిగా విడిచి మరీ ఎక్కువగా కదిల్చిన వక్షాల్తో, నొసటిమీంచి ముక్కు పక్కగా కదిలి, ఎత్తులేని చెక్కిలిమీదుగా కంగారుగా జారి, పెదవి కింద పల్లంవేపుగా కొట్టుకొచ్చి. అగాధంలాంటి కంఠంలోతుల్లోకి దూకడానికి భయపడి అక్కడే ఆగిపోయిన అందమైన చెమట బిందువుతో, స్నేహ పూరితమైన చూపుల్తో నిలుచుని వుంది.

"అరరె....ఇంత ఎండలో వెళ్ళకపోతే ఏంపోయింది. ఎండ ఎలా మాడ్చేస్తోందో బయట. చెమటలుకూడా కారుతున్నాయి. ఏ సాయంకాలమో వెళ్ళి తీసుకురావల్సింది." అన్నాడు. అన్నాడే గాని అతని మాటలు అతనికే నచ్చలేదు; ఎబ్బెట్టుగా వున్నాయి. కృతజ్ఞత చెప్పుకునే మాట ఒక్కటీలేదు. కృతజ్ఞత చెప్పుకుందామనే మొదలెట్టాడు ఏమి టేమిటో అనుకోనివన్నీ మాట్లాడేశాడు. కృతజ్ఞత అతని దగ్గరే వుండిపోయింది. ఈ యిబ్బంది ఎందుకొచ్చిందో అతనికి తెలుసు. స్వేచ్ఛగా 'నువ్వు' అని ప్రయోగించలేని బెరుకుతనం. అందువల్ల మనసులోని భావం మాటల్లోకి రాలేదు. మరికొన్ని రోజులపాటు యీ యిబ్బంది తప్పదు. అంతవరకూ యిలా మాటల్ని తడుముకోవాల్సిందే.

పుస్తకాలు అందుకున్నాడు.

"ఇవి చదివేసిన తర్వాత యిచ్చేసి మరికొన్ని తేవచ్చులెండి" అంది.

"అలాగే; వీటితో వారం రోజులపాటు కాలక్షేపం చెయ్యొచ్చు."

నాగావళి యింట్లోకి వెళ్ళిపోయింది.

ఒకసారి పుస్తకాలన్నీ తిరిగేసి 'ఫరవాలేదు. మంచి సెలక్షనే' అనుకున్నాడు.

కాస్సేపటికి పోస్టుమేన్ వచ్చాడు. ఆ తర్వాత యిక అతనికి అవతలికి వెళ్ళాలనిపించలేదు. ఓ పుస్తకం ముందేసుకుని కూర్చుండిపోయాడు ఆ రోజిక మళ్ళీ నాగావళి పలకరించలేదు.

మర్నాడు శెలవురోజు. రాఘవరావుగారు పొద్దున్నే అతన్ని వెంటేసుకుని తెలిసిన నలుగురి దగ్గరికి తీసుకెళ్ళారు. ఆ రోజల్లా అలా బయట తిరగడం తోనే సరిపోయింది. ఆ తర్వాతరోజు ఉదయం కాఫీ పట్టుకొచ్చినప్పుడూ,

నీళ్ళు తోడినప్పుడూ, మధ్యాహ్నం విసనకర్ర పట్టుకొచ్చి యిచ్చినప్పుడూ, సాయంకాలం వీధివరండాలో వున్నప్పుడూ నాగావళి పలకరించినా జ్ఞాపకాల్లో నిలుపుకోదగ్గ ప్రత్యేకత ఏమీలేని పొడి పొడి మాటలే అవడంవల్ల అతనుకూడా అట్టే పట్టించుకోలేదు. అయితే ఆతర్వాత కూడా అలానే గడిచిన యింకో రెండు రోజుల్లోనూ అరడజను అనుభవాల్ని ఏరుకున్నాడు.

అందులో చివరిది—

నవల ఒకటి సాయంకాలంవరకు చదివి విసుగెత్తి షికారుకని బయలుదేరాడు. మురిగ్గా, యిరుగ్గావున్న బాటల్నుంచి తప్పించుకునివెళ్ళి ఓ పార్కులో కూర్చున్నాడు. అతనికి దగ్గర్లోనే నిప్పులాంటి రంగులో ఎర్రటి పూలు నాలుగు సన్నగా, పొడుగ్గా, ఆ డు గు ఎ త్తు లో వు న్న కాడల మీద చిరుగాలులకు సైతం పులకరించిపోతున్నాయి. మనసు కూడా అంతే. ఎంత ఉన్నతంగా వుంటే అంతగా అతి చిన్న అనుభవానికి కూడా పులకరించి పోతుంది. ఈర్ష్యతో, కుత్సితంతో, పగతో, అసహనంతో నిండి కరుకుగా, మోటుగా ఎదిగి ఉన్నతంగా నిలవలేని మనసు బలమైన ఉద్రేకానికి తప్ప సున్నితమైన అనుభవానికి పులకరించలేదు. ఈ సత్యాన్ని తెలుసుకోలేనిమనిషి పగతో, ద్వేషంతో, అసహనంతో మనసును నింపుకుని రసమయమైన యీ జగత్తును చూడలేక కళ్ళుండీ గుడ్డివాడైపోతున్నాడు.

సదానందకి ఓ పువ్వు కోసుకోవాలనిపించింది. తోటమాలిని పిలిచి అడిగితే అతని ఆకారాన్ని చూసి "దానికేం భాగ్యం కోసుకోండి" అన్నాడు. కాడతోపాటు ఒకటి కోసుకుని, మరికాస్సేపు అక్కడే కూర్చుని లేచి బయలు దేరాడు.

ఆకాశం కాలికాలి నల్లబడిపోయింది. అక్కడక్కడ యింకా ఆరిపోని నిప్పుల్లా మెరుస్తున్నాయి నక్షత్రాలు. సముద్రంమీంచి గాలి అలలు అలలుగా వీస్తోంది. అడుగుల్లో అడుగులు వేసుకుంటూ మెల్లగా నడుస్తున్నాడు. టౌనుహాలు దగ్గరకార్లూ, ఖరీదైనమనుషులూ, దీపాలూ, దుమ్ము-మంచి హడావిడిగావుంది. దగ్గరకు వెళ్ళాడు. ఇంటర్‌స్టేట్ కల్చరల్ ఎక్చేంజ్ ప్రోగ్రాం క్రింద వొచ్చిన మద్రాసు సాంస్కృతిక బృందంవారు భరతనాట్య ప్రదర్శన యిస్తున్నారట.

భరతనాట్యం అనేసరికి సదానంద మనసు ఎగిరి గంతేసింది. అందులోనూ మద్రాసు బృందంవారి ప్రదర్శన. ఇటీవలి కాలంలోకూడా భారతదేశంలో లలితకళలు సంకరంకాకుండా స్వచ్ఛంగా సాంప్రదాయాన్ని పరిపోషించుకుంటూ ఎక్కడన్నా వున్నాయంటే అవి ఆంధ్రదేశానికి దిగువనే తప్ప పైన కాదని అతని అభిప్రాయం.

టిక్కెట్టు కొనుక్కుని లోపలకు వెళ్ళాడు. అప్పుడే ప్రదర్శన ప్రారంభమైంది. ఇద్దరమ్మాయిలు కలసి అలారిప్పు ప్రదర్శిస్తున్నారు. పక్కవాయిద్యాలు చక్కగా కుదిరాయి. గాయకి కంఠంలో సంగతులు పలికిస్తోంది. నాట్యంచేస్తున్న యిద్దరూ రసాభినయం చేస్తున్నారు. వాళ్ళ పాదాలు లయబద్ధంగా పడుతున్నాయి. గజ్జెల చిరుమువ్వలు బృందశబ్దంచేస్తూ తల వూపుతున్నాయి. ఫిడేలుతీగలమీద కమాను ఊయలలూగుతోంది. మృదంగం మీద వ్రేళ్లు నృత్యం చేస్తున్నాయి. అన్ని నాదాలూ పాయలుపాయలుగా వచ్చి ఒకేతాడుగా అల్లుకుని ప్రేక్షకుల్ని బంధించేశాయి.

తెర వాలింది.

చప్పట్లతో హాలు దద్దరిల్లిపోయింది.

"ఎందుకలా చప్పట్లు చరుస్తారో వీళ్లు. దాన్నిండా అన్నీ తప్పులే. ముద్రలు పట్టడంతోనే సరిపోదు, తాళానికితగ్గట్టు పాదాలుపడందే; ఇంతకన్నా చక్కగానే చేయగలను నేను"- ఎవరో విసుక్కుంటున్న శబ్దం వినిపించింది సదానందకి.

వెనక్కుతిరిగి చూశాడు. పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ముఖం చిట్లించుకుని పక్కావిడతో మాట్లాడుతోంది. ఆమె కూడా నర్తకే అని ఆమెకళ్ళ అలంకరణే తెలుపుతోంది.

ఆ తర్వాత ప్రదర్శనలప్పుడుకూడా ఆమె ఏదో కామెంట్ చేస్తూనేవుంది.

సదానందానికి నవ్వొచ్చింది. ఈ కళాకారు లంతా యింతే, వొట్టిస్వార్థపరులు. నిజానికి కవులు, చిత్రకారులు, గాయకులు, నర్తకులంత స్వార్థపరులు మరొకరులేరు. పిసినిగొట్టువాడి స్వార్థం డబ్బు విషయంలోవుంటే కళాకారుడి స్వార్థం కీర్తి విషయంలో వుంటుంది. ఒక విధంగా పిసినిగొట్టువాడే నయం.

పిసినిగొట్టువాడి స్వార్థం అతని కుటుంబానికి సంబంధించినది, కాని కళాకారుడి స్వార్థం అతని ఒక్కడికే సంబంధించినది. అందుకే సదానంద కళను గౌరవించినంతగా కళాకారుడ్ని గౌరవించలేదు.

ప్రదర్శన పూర్తయ్యేసరికి చాలారాత్రయింది.

ఎప్పుడైనా చక్కని అనుభవం సదానందకు లభిస్తే ఆ అనుభవాన్ని తలంచుకొంటూ కొద్దిసేపు వొంటరిగా నడవాలనిపిస్తుంది అతనికి. అనుభవాన్ని ఆ వెంటనే హృదయంలోంచి తోడుకుంటే ఆ అడుగున చేరిన స్వచ్ఛమైన పరిమళభరితమైన అనుభూతి మిగులుతుంది.

అంతరాత్రిలోనూ, విశాలమైన ఆకాశంకింద నిర్మానుష్యమైన బాటల్లో నడిచి యింటిని చేరుకున్నాడు. కాంపౌండుగోడకున్న బయటి తలుపు వేసి వుంది. ఈ పాటికి అంతా గాఢనిద్రలో వుంటారు. తలుపు తట్టి పిలుద్దా మనుకున్నాడు. కాని—

ఆ తలుపులే తెరచుకున్నాయి. ఆ తెరచిన తలుపుల వెనక నాగావళి!

అతనికి ఆశ్చర్యం వేసింది. ఇంత రాత్రివరకూ నిద్రపోకుండా తన గురించి ఎదురుచుస్తూ తనరాకను కనిపెట్టుకుని కూర్చున్నదన్నమాట. తనగురించి యింతగా పట్టించుకున్న హృదయం ఒకటి వుండడం ఎంత అదృష్టం. అతనికి చెప్పలేని ఆనందమైంది.

"రండి, అక్కడే వుండిపోయారేం" పక్కకు తప్పకుంది. అతను లోపలకు వెళ్ళిపోయాడు. ఆమెకూడా తలుపేసుకుని లోపలకు వచ్చేసింది.

భోజనం వడ్డించి పిలుస్తే వెళ్ళాడు. ఆమె వడ్డించడం అదే మొదటిసారి. వాళ్ళమ్మను లేపబోతే బామ్మ కోప్పడింది. "నువ్వెళ్ళి వడ్డించవే, దాన్ని లేపుతా వెందుకు నడుంనొప్పని పడుకుంటేనూ" అంది. ఆ మాటలు వినిపించాయి. ఆ తర్వాత అయిదు నిముషాలకు నాగవళి వచ్చి పిలిచింది.

తలవంచుకుని భోజనం చేస్తున్నాడు. తినాలనిలేదు. ఆకలి చచ్చిపోయింది. నాగావళి అవతలి ద్వారబంధం దగ్గర నిలుచునివుండి చూస్తోంది. అందుకని ఏలాగో భోంచేస్తున్నాడు.

"సినిమాకు వెళ్ళారా?"

"లేదు. డేన్సు ప్రోగ్రాంకు వెళ్ళాను."

ఆమె ఓసారి కళ్ళు ఎగరేసింది. "అభిరుచులు మంచివేకాని అలవాట్లే బావుండలేదు." అంది.

అర్థంకానట్టు చూశాడు అతను.

"ఆ అన్నం తినడానికి ఎంత యిబ్బంది పడుతున్నారో చూస్తూనే వున్నాను. ఇంతరాత్రి ఆకలేం వుంటుంది చెప్పండి. వేళకు భోజనం చెయ్యక పోతే ఆరోగ్యం పాడవదూ."

అతనేమీ మాట్లాడలేదు. ఈకొద్దిరోజుల్లోనూ రాత్రిళ్ళు అలా ఆలస్యంగా రావడం యిదే మొదటిసారి కాదు. సముద్రపు వడ్డున కూర్చుంటే ఓ రాత్రి పన్నెండయ్యింది. మరొకరోజు వెన్నెల వుందని అప్‌లేండ్స్‌లో పిచ్చిగా తిరిగి యింటికొచ్చేసరికి పదకొండు దాటింది. తను వొచ్చేసరికి కనిపించకపోయినా తనను కనిపెడుతూనే వున్నదన్నమాట!

ఎంత తినాలని ప్రయత్నించినా అంతరాత్రప్పుడు అన్నం సహించలేదు. మధ్యలోనే చేతులు కడుక్కుని లేచిపోయాడు.

"మరీ యింట్లోంచి కదలకుండా కూచోనక్కరలేదుగాని ఎక్కడికైనా వెళ్తేమటుకు యింటిని మర్చిపోకండి" అంది లేచొస్తోన్న అతనితో.

బావుంది. చాలా సున్నితంగా శాసిస్తోందీమె. ఈ కొద్దిపాటి పరిచయంతోనూ తనను కట్టిపడేయాలని చూస్తోంది కాబోలు.

—అతనికి నవ్వొచ్చింది. నవ్వుకుని గదిలోకి వెళ్ళిపోయాడు. సిగరెట్టు కాల్దామని జేబులోంచి పెట్టె తియ్యబోతే పార్కులో కోసినపువ్వు కింద పడింది. అది తీసి మృదువైన దానిరేకల్తో చెక్కిలిమీద రాసుకుంటున్నాడు.

నాగావళి గదిలోకి వచ్చింది. "అన్నం సరిగా తిననేలేదు. అసలే వేసవి కాలం—వేడి చేస్తుంది. ఇవైనా తినండి." అని ప్లేటుతో మామిడిపళ్ళ ముక్కలూ గ్లాసులో నీళ్ళూ అక్కడ పెట్టి క్షణంసేపు అతని చేతిలోని పువ్వువైపు చూసి, నవ్వుకుని వెళ్ళిపోయింది.

అదే.... ఆ చిరునవ్వును- అనురాగపు అరుణిమను పూసుకుని పల్చని నాజూకు పెదాలవెనక స్నేహపు ధవళిమను నింపుకున్న ఆ చిరునవ్వును- ఆమె తోరణంగా వేలాడగట్టిన మల్లెపూదండలోంచి జారిపడిన చిన్న రేఖలాంటి క్షణం చిరునవ్వును- అతను ఏరుకుని దాచుకున్నాడు-

ఇలా తెరిచిన కిటికీల్లోంచి తన జీవితంలోకి తొంగిచూస్తోన్న నాగావళి తన యింట్లోకి ఎప్పుడు అడుగుపెడుతుందో! ఆనాడు ఈ యింటి తాళాలు ఆమెకు యిచ్చెయ్యాలి. ఇంటి పెరట్లో పూలమొక్కల్ని నాటమనాలి. అనురాగాన్ని అడుగడుగునా జ్ఞప్తికి తెచ్చే ఎర్రటిపూలనే పండించమనాలి. ఎరుపులో ఎన్ని వన్నెలున్నాయో అన్నివన్నెల పూలూ అందులో వుండాలి. సిగ్గుతో కందిన చెక్కిలి ఎరుపు, ఆకలి కదిలిన మంట ఎరుపు, తాంబూలం తడిపిన పెదాల ఎరుపు, వెలుగు కరిగిన ఉదయపు ఎరుపు, పసుపు చేరిన కాషాయ ఎరుపు, పసుపు చేరని మెజంటా ఎరుపు, వెన్నెల్లో తామరపూవు ఎరుపు, పండిన గోరింటాకు ఎరుపు, ముగ్గిన జామిపండు ఎరుపు — యిలా ఎన్ని ఎరుపులున్నాయో అన్నిటినీ పండించమనాలి. ఆమెను మడుల్ని కట్టమని తను నీళ్లుపోయాలి. రోజూ పూలు కోయాలి. వాటితో యింటిని అలంకరించాలి....

జీవితానికి కోటాకొట్టుకొని, భవిష్యత్తు అద్దంలో తనరూపం చూసుకుని తననితానే గుర్తుపట్టలేకపోయాడు. రాత్రి చాలా సేపటి వరకూ ఆ ఆకారాన్నే చూస్తూ కూర్చున్నాడు. ఉదయం లేచేసరికి ఇంట్లో మాటలు వినిపిస్తున్నాయి. రాఘవరావుగారి కంఠం అది.

"అబ్బాయి లేచాడో లేదో, ఉమాపతిరావుగారు పొద్దున్నే అతన్ని వచ్చి కలవమన్నారు. వాళ్ళాఫీసులో ఓ ఖాళీ వుందట.''

"ఆమధ్య మీరు చెప్పిన వుద్యోగమేనా. అసలు ఆయనకు ఆవుద్యోగం చేయడం యిష్టమో కాదో కనుక్కోండి. ఆయనదంతా అదో తరహా."

ఏమిటి! నాగావళి తన తత్వాన్నికూడా తెలుసుకున్నట్లు మాట్లాడేస్తోంది. చాలా సన్నిహితంగా తనని పరిశీలిస్తోందన్నమాట. తన తత్వంకూడా ఆమెకు కావలసివచ్చింది. తన అభిరుచుల్నీ, యిష్టాయిష్టాల్నీ కూడా తన కన్నా ముందుగా ఆపిడే వూహించేస్తోంది. తనదంతా అదో తరహా అంటే అర్థం ఆమె తరహా కాదనా. ఇంతకీ ఆమె తత్వం ఏమిటి? ఆమె అభిరుచులు

ఏమిటి? ఏమాత్రం బయట పడదేం. ఎంత గుంభనం! సాహిత్యంలో ప్రవేశ ముందా? సంగీతం వచ్చా? పాడేవాళ్ళలో బహుతక్కువమందీ, నాట్యం చేసే వాళ్లలో బహు ఎక్కువమందీ అందంగా వుంటారట. ఇంత అందమైన అమ్మాయికి నాట్యం రాకుండా వుంటుందా.......

నాగావళి వచ్చింది. అతని గది కిటికీముందు నందివర్ధనంచెట్టుకింద నుంచి సిగరెట్టుపొగ పాయలు పాయలుగా గదిలోకి ఎగరడం చూసి అతను లేచాడని తెలుసుకుని తలుపురెక్కలు కొద్దిగా తోస్తూ "లేచారా? నాన్నగారు అడిగారు మిమ్మల్ని. ఎవరినో కలుసుకోవాలట, వేగంగా తెమలమంటున్నారు" అంది.

కొద్దిగా తెరచిన తలుపురెక్కల సందులోంచి కనిపిస్తోంది ఆమె. బిగువు సడలి, చెవులమీదకు జారి, చుట్టూ ఆవరించిన నల్లని జుత్తులో మరీ తెల్లగా నందివర్ధనం పువ్వులా వుంది ఆమె ముఖం. ఆకులమీద వాలి, అవి కదిలినప్పుడు పక్కలకు చెదిరి అడుగున పూసిన పుష్పం చెక్కిలిమీద ముద్దిడుతున్న ఉదయారుణ కిరణంలా ఆమె నొసటి కుంకుమబొట్టు తలుపుభాళీలో దాగుడుమూతలాడుతూ మెరుస్తోంది. రెక్కల్ని ఆడించి శక్తిని పుంజుకుని గాలిలో తేలిపోయే గండుతుమ్మెదల్లా నల్లటి కనురెప్పల్ని టపటపా కొట్టుకొని ఎగిరిన చూపులు తలుపు మధ్య కాళీ యిరుకు సందులోంచి స్వేచ్ఛగా రాలేక పోతున్నాయి. మంచుపడి రేకల మీదుగా జారి తెగి కింద పడిపోలేక అంటి పెట్టుకుని వేలాడుతోన్న సాగిన మంచుబిందువులా వుంది ముక్కు.

అలా ఆ సన్నటి తలుపుసందులోంచి కనిపించీ కనిపించనట్టు నిలుచున్న నాగావళి మరీ మనోహరంగా వుంది. లేచొచ్చి తలుపులు బార్లా తెరిచి లోపలికి రమ్మని పిలుద్దామని కూడా అనుకోలేదు అతను. తెరిచేస్తే యింత అందం అప్పుడు వుండదు. ఎంత నిర్మలంగా వున్నా మేఘాలు లేకపోతే ఆకాశానికి అందంలేదు. మేఘాలు ఆకాశాన్ని కప్పి, అక్కడక్కడా కొద్ది కొద్దిగా వొదిలేసి వున్నప్పుడే అందం ఎంత అందగాడయినా, ఏ కొబ్బరి చెట్ల ఆకులచాటునో దాగుడుమూతలాడుతున్నప్పుడే చంద్రుడి అందం రాణిస్తుంది. తామరాకుల్ని కప్పుకుని అక్కడక్కడ నగ్నంగా వొదిలేసినవొంపుల్ని చూపించినప్పుడే కొలనువైపు మళ్ళీ చూడాలనిపిస్తుంది.

"ఏమిటి! ఇంకా లేవదలచుకోలేదా మీరు. రాత్రి భోజనం కూడా సరిగా చెయ్యలేదు. లేచి ముఖం కడుక్కుంటే టిఫిను చేద్దురుగాని!" తలుపులు బార్లా తీసేసింది. రాత్రితెచ్చిన మామిడిముక్కల ప్లేటూ, గ్లాసూ తీసుకెడదామని గదిలోకి అడుగుపెట్టి ఆగిపోయింది.

ప్లేటులో మామిడి ముక్కలు ఎలాపెట్టినవి అలానే వున్నాయి అక్కడ!

''ఇవి తినలేదూ! వాటి విషయమే మరిచిపోయానుసుమా!!" అన్నాడు.

నాగావళి ఏమీ మాట్లాడలేదు. కొద్దిక్షణాలు అతని ముఖంలోకి చూసి, గ్లాసు తీసుకుని వెళ్ళిపోయింది.

ఆ పగలల్లా మళ్ళీ ఆమె అతనికి ఎదురుపడనేలేదు. టిఫిను, కాఫీ పట్టుకొస్తుందేమో అనుకున్నాడు. ఆమె రాలేదు. లోపల్నుండి కబురొస్తే అతనే వెళ్ళాడు. ఆమెకు కోపం వచ్చిందనే సంగతి సాయంకాలానికి గాని అతనికి అర్థం కాలేదు. కొత్తలో మాట్లాడకపోయినా కనీసం కనిపించనైనా కనిపించేది. ఈరోజు ఉదయం తర్వాత ఆమె దర్శనమే లేదు. కనిపిస్తే ఉదయం వెళ్ళొచ్చిన ఉద్యోగం సంగతి మాట్లాడాలనుకున్నాడు. అదీగాక, వారం పదిరోజులపాటు కాలక్షేపం అనుకున్న పుస్తకాల్ని ఐదురోజుల్లోనే చదివేశాడు. కొత్తవి పట్టుకురమ్మని చెప్పాలి.

మధ్యాహ్నంనించీ మాటిమాటికీ వరండాలోకి వస్తూనే వున్నాడు నాగావళి కనిపిస్తుందేమోనని. అలా సాయంకాలం వరకూ చూసింతర్వాత చటుక్కున తట్టింది - తను మామిడి పళ్లముక్కల్ని తినకుండా వదిలేసినందుకు కోపం వచ్చుంటుందని.

నవ్వుకున్నాడు.

తనకు కావలసింది ఇలాంటి హృదయమే. ఇంత సున్నితంగా స్పందించేదే కావాలి. అప్పుడప్పుడూ ఇలా కోపమూ, బెట్టుసరి కూడా వుండాలి. దగ్గరగా వుంటూనే దూరంగా మెలగాలి. అలా వున్నప్పుడే అనుబంధం నిత్య నూతనంగా వుంటుంది. రోజూ ఉదయించే సూర్యచంద్రులే అయినా రోజూ కొత్తగానే వుంటారు వారు. ఆ కొత్తదనం వాళ్ళ దాగుడుమూతల్లోనే వుంది. చీకటి నీడల మధ్య వెన్నెల వెల్తురులకు అందం. లోయల పక్కనే కొండ

లకు అందం. కన్నీళ్ళుపోసి పెంచితేనే చిరునవ్వులపూలు రంగుల్నీ, సువాసనల్నీ నింపుకుంటాయి. కొంత బాధ, కొంత నిరీక్షణ కావాలి. నిరీక్షణ ఆశగా ఊహించడం నేర్పుతుంది.

ఆ సాయంకాలం షికారుకు వెళ్ళినప్పుడు ఓ పాతిక మామిడిపళ్ళు బుట్టలో కుట్టించి పట్టుకొచ్చాడు సదానంద.

ఇదేమిటోయ్ పళ్లుకొన్నావ్. యింట్లోవున్నాయిగా" అన్నారు రాఘవరావుగారు.

"చవగ్గావచ్చాయి లెండి. పట్టుకొచ్చిపడేస్తే యింట్లోవాళ్ళయినా తింటారు కదాని కొన్నాను."

"ఏమిటో నీ చాదస్తంగాని యివన్నీ యెందుకు చెప్పు" అని కూతుర్ని కేకేసి లోపలకు తీసుకెళ్ళమన్నారు.

నాగావళి వచ్చి పళ్ళు చూసి తనలో తనే నవ్వుకుని లోపలికి తీసుకెళ్లింది.

చాలా సేపు రాఘవరావుగారితో ఉద్యోగ విషయాలు మాట్లాడుతూ కూర్చుండి పోయాడు. భోజనం వడ్డించి పిలుస్తే యిద్దరూ లేచారు. నాగావళి తల్లే వడ్డించింది. గబగబా భోజనం చేసి ముందుగానే లేచి వొచ్చేశాడు సదానంద. గదిలోకి వెళ్ళబోతోంటే వీధివరండా స్తంభం దగ్గర నాగావళి నిలుచునివుంది. అతన్ని చూసి యింట్లోకి వెళ్ళిపోబోతుంటే అతనే పలకరించాడు. ఆమె ఆగిపోయింది.

"సాయంకాలం కనిపిస్తే పుస్తకాలు ఏమన్నా పట్టుకురమ్మనమని చెప్పాలనుకున్నాను. కనిపించనే లేదు. మొన్నటివి చదివేశాను." అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు

"ఉదయం ఉమాపతి రావుగార్ని కలుసుకున్నాను. ఖాళీ వుంది. అప్లికేషను యిచ్చి, మంచిరోజు చూసుకుని చేరమంటున్నారు. ఉద్యోగం వచ్చినట్టే. ఆలోచించాలి మరి. తరచుగా కేంపులు వుంటాయట." అన్నాడు తిరిగి.

అప్పటికీ ఆమె ఏమీ మాటాడలేదు.

"కోపం వచ్చింది కాబోలు మామిడి ముక్కలు తినలేదని; నిజంగానే మర్చిపోయాను. నాకు మతి మరుపు ఎక్కువ, లేకపోతే మామిడి పళ్ళని తిన కుండా వొదిలేస్తానా. అవంటే నాకు చాలా యిష్టం గనకనే దారిలో చవగ్గా అమ్ముతుంటే కొని పట్టుకొచ్చాను యివ్వాళ. చిన్నప్పుడు మా వూళ్ళో రోజూ తోటల్లోకి పోయి దొంగచాటుగా....

నవ్వొచ్చిందామెకు. నవ్వుకుని-

"ఇంత పెద్ద సంజాయిషీ యిచ్చుకోనక్కరలేదు లెండి. అయినా నాకు కోపం వచ్చుంటుందని ఎలా అనుకుంటున్నారు?" అంది.

అవును; ఆమెకు కోపం వచ్చుంటుందని ఎలా అనుకుంటున్నాడు తను? ఆమె కనిపించకపోవడానికి అనేక కారణాలు వుండొచ్చు. పని వత్తిడిలో వుండిపోయిందేమో! ఒంట్లో బావుండలేదేమో!

ఆమె అడిగిన ప్రశ్నకు అతను సమాధానం చెప్పలేకపోయాడు.

"ఇంతకీ మీరు ఉమాపతిరావుగారి ఆఫీసులో చేరుతున్నారా?"

"అదే ఆలోచిస్తున్నాను-తిరగాలట కదా."

"పోనీ లెండి. ఆ చూసుకునే దేదో కాస్త మంచి ఉద్యోగం చూసుకుని చేరితేసరి. నాన్నగారు అదేదో బేంకులో ఉద్యోగం చూస్తున్నారు. అదొస్తే బాగానే వుంటుంది. ఈ పదిహేను రోజులకూ కంగారెందుకూ?"

సదానందకు ఆశ్చర్యంగా వుంది ఇంతకుముందే రాఘవరావుగారు అడిగితే మంచిరోజు చూసుకునే చేరిపోవాలనుకుంటున్నాను అన్నాడు. అదే మాట ఎదుట అనలేకపోయాడు. నాగావళి ప్రభావం తన మీద పడుతోందా అన్న అనుమానం వచ్చింది అతనికి. అంతకుముందు చేరదామనే అనుకున్నాడు. కాని యిప్పుడు చేరాలనిలేదు. నాగావళి ప్రభావం తనమీద పడిందనడానికి యింత కన్నా నిదర్శనం అతనికి అక్కరలేకపోయింది.

"నా వ్యక్తిత్వం?" ఏమైపోయింది అనుకున్నాడు దోచుకోబడిన వాడిలాగ హృదయాన్ని తడుముకుంటూ.

మర్నాడు రాఘవరావుగారితో ఉద్యోగం విషయం చెప్పాడు.

"దానికేముందీ, అలానే. ఆ ఉద్యోగంలో చేరడం నాకు కూడా అట్టే యిష్టం లేదనుకో. సర్లే, మరోటి ప్రయత్నిస్తున్నాను. వారం రోజుల్లో తెలుస్తుంది" అన్నారు.

సదానంద ఆ విషయం చెప్పినప్పుడు నాగావళి అవతలి గదిలోనే వుంది. కొద్దిసేపు కిటికీలోంచి అతన్నే తేరిపారచూసి, తిరిగి తన పనిలో తాను మునిగిపోయింది.

రాఘవరావుగారు ఆఫీసుకు వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళాక బయటితలుపు గడియపెట్టి నాగావళి తిరిగి వస్తుండగా చూసి గబగబా వరండాలోకి వచ్చాడు సదానంద.

"ఆ పుస్తకాలు చదివేశాను. అవి యిచ్చేసి కొత్తవేవైనా పట్టుకొస్తే...." మధ్యలోనే ఆగిపోయాడు.

"జ్ఞాపకం వుందిలెండి. మతిమరుపు మీకేగాని నాకు లేదు. పొద్దుటినుంచీ ఊపిరి పీల్చుకోవడాని క్కూడా తీరికలేదు. ఇదుగో, వంటపని పూర్తయ్యిం దనుకుంటే వడ్డింపులూ అవీనీ; అవీ అయిపోతే తీరిగ్గా వెళ్ళిరావచ్చని ఆగిపోయాను."

సదానంద ఆశ్చర్యంగా చూశాడు. "ఏమిటీ! వంట నువ్వే చేస్తావా?"

చాలా అమాయకంగానూ, అతి సామాన్యంగానూ 'నేనే' అన్నట్టు తలూపింది.

"రోజూ నువ్వేనా?"

చాలా విచిత్రంగానూ, కొత్తగానూ చూసింది.

"అదేమిటి? అలా అడిగారు?"

" ఏమీ లేదు."

"ఊరికే అడిగుంటే అంత ఆశ్చరం దేనికి, బహుశా నాకు వంట చేత కాదని అనుకుని వుంటారు. అవునా?"

"వంట రాదని ఎలా అనుకుంటాను. చదువుకొనేటప్పుడు రూంమేట్స్ అయిదుగురం. అందులో నలుగురికి వంటొచ్చు. మగాళ్ళకే వస్తోంటే ఆడాళ్ళకి రాదూ."

"మరి అలా అడిగారేం?"

అతనేమీ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాడు.

"చెప్పండి. వట్టినే అడిగుండరు."

చాలా సేపు అతనేమీ మాట్లాడలేదు. ఆ తర్వాత మెల్లగా జేబులోంచి సిగరెట్టు తీసి వెలిగించి పొగ వదుల్తూ—

"మీ డాన్సు గురువుగారు ఎవరూ?" అన్నాడు.

తెల్లబోయిందామె. అర్థంకాక అయోమయంతో కళ్ళు చిట్లించి, ఇబ్బంది కరంగా జారిన యిరుకు చూపుల్ని అతనిమీద నిలిపి, ముఖంనిండా అల్లుకున్న ఆ ముడుల్ని మెల్లగా సడలిస్తూ ఆలోచనల్లోకి దూరి చూస్తోంది.

"అదే — చిన్నప్పుడు డాన్సు నేర్పిన గురువుగారెవరో తెలుసుకుందామని."

నవ్వుల్తో పగిలిపోయి బేలెన్సు నిలుపుకోలేక నిజంగానే డాన్సు చేసింది ఆమె. "నేనా.... నేను డాన్సు నేర్చుకోవడ మేమిటండీ.... కలగన్నారా?"

"సారీ .... డాన్సంటున్నానేమిటీ, డాన్సు కాదు, సంగీతం. సంగీతం నేర్పిన గురువుగారి పేరేమిటీ?"

"ఇది మరీ బావుందండోయ్. ఇవ్వాళ చాలా విచిత్రంగా మాట్లాడుతున్నారే మీరు. నేను నేర్చుకోకపోవడం అటుంచి కనీసం నేర్చుకున్న స్నేహితురాళ్ళయినా లేరుకదా నాకు. ఏమిటి ఇలా అడిగారు?"

"ఏమిటో వచ్చుంటుందని అడిగాను. మరేంలేదు. ఇవ్వాళ కూజాలో నీళ్ళు పోశారా, దాహంగా వుంది. ఓ గ్లాసుడు నీళ్ళు తెచ్చిపెడతావా?"

తెగిపోయిన కలల మత్తులోంచి కదిలి వెళ్ళినట్టు ఆలోచనల్లో ఊగుతూ ఊగుతూ మెల్లగా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వెళ్ళింది నాగావళి. రెండు నిమిషాల్లో గ్లాసుతో మజ్జిగ పట్టుకొచ్చింది.

"ఇదేమిటీ! మంచినీళ్ళు తెమ్మంటే మజ్జిగ పట్టుకొచ్చావ్. కూజాలో నీళ్ళు పోయలేదూ యివ్వాళ?" అన్నాడు అతను.

"పోనీ గానీ ముందిది తీసుకోండి. అంతగా కూజానీళ్లు తాగాలంటే మరో గ్లాసుతో తెస్తాను."

"అదికాదు......."

"అది అయినా కాకపోయినా ముందు ఇది తీసుకోండి. ఇదేమీ కషాయం కాదు, తీసుకోండి."

గ్లాసు అందుకుని తాగుతూ మధ్యలో ఆపేసి —

'ఏమిటా అధికారం? ఆ శాసింపు ఏమిటి? అలా బలవంతం చేసి తాగించకపోతేనేం? పోనీ ఆ కంఠాన్ని మరికాస్త మృదువుగా, నెమ్మదిగా పలికిస్తే ఏం పోయిందీ?' అనుకున్నాడు. ఓ సారి ఆ మె ముఖంలోకి చూసి మిగిలిన మజ్జిగనుకూడా గడగడా తాగేశాడు.

ఆమె గ్లాసును తీసుకుని వెళ్లిపోబోతూ ఆగిపోయి "ఇంతకీ మీరు అసలు విషయం చెప్పకుండా దాచేశారుకదూ. చెప్పరా ఎందుకడిగారో?" అంది. ముఖం కొద్దిగా వంచి, బతిమాలుతున్న ధోరణిలో కళ్ళకొసల్ని జాలితో తడిపి, కనుగుడ్లను రెండింటినీ మూలల్లో నిలిపి రెప్పల్ని వాల్చకుండా అతన్నే చూస్తూ నిలుచుంది.

"ఊరికే యధాలాపంగా అడిగాను. మరీ యింతగా పట్టించుకుంటావేమిటీ! ఏమీ లేదు." అన్నాడు గదిలోకి వెళ్ళిపోతూ. నాగావళి కూడా చాలాసేపు అక్కడే నిలుచుని యింట్లోకి వెళ్లిపోయింది.

భోజనాలు అయిపోయాక పుస్తకాలగురించి వెళ్దామనుకుంది కాని కుదరలేదు ఇంట్లో అప్పడాలు చేస్తోంటే, ఆ పనిలో మునిగిపోయింది. సాయంకాలానికిగాని వెళ్లి తీసుకురావడం పడలేదు. తీరా తెచ్చేసరికి సదానంద షికారుకు వెళ్ళిపోయాడు. అతను తిరిగి వచ్చేసరికి రాత్రయిపోయింది. అతను తిరిగి రావడం చూసి, కొద్దిసేపు వూరుకుని పుస్తకాలు పట్టుకుని వచ్చింది నాగావళి.

చాపమీద కూర్చుని వుత్తరాలు రాసుకుంటున్న సదానంద తనమీద నీడ పడితే తలెత్తి చూశాడు. పుస్తకాలు పట్టుకుని నిలుచుని వుంది నాగావళి ఆమె నీడనుంచి తప్పుకుని అవతలకు జరిగి కూర్చున్నాడు.

"పుస్తకాలు తెచ్చావా? చాలా థాంక్స్. నీకు చాలా శ్రమ యిస్తున్నాను కదూ." పుస్తకాలు అందుకొని, ఓసారి అలా తిరగేసి పక్కన పెట్టి "నువ్వు చదివావా వీటిని? ఎప్పుడూ పుస్తకాలు చదువుతున్నట్టే కనిపించవు సాహిత్యం అంటే యింటరెస్టు లేదా నీకు?" అన్నాడు.

"ఏమీ తోచకపోతే చదువుతుంటాను. మరీ మీలా పిచ్చిగా చదివే అలవాటు నాకు లేదులెండి. వాటిని అర్థం చేసుకునే శక్తి కూడా వుండాలి కదా? అంత పెద్ద చదువులు నేను చదువుకోలేదు."

అకస్మాత్తుగా మౌనముద్రలోకి వెళ్ళినట్టు కొన్ని క్షణాలు అతనేమీ మాట్లాడలేదు. ఆమె చూసి చూసి చివరకు వెళ్ళిపోదామనుకుని "భోజనం వడ్డించేసింది అమ్మ. పిలుద్దామనే వచ్చాను. ముందు భోంచేసి ఆ తర్వాత కూర్చుని రాసుకోండి" అంది. వెనక్కు తిరిగి రెండడుగులు వేసింది.

"నాగావళీ!"

చెంగు పట్టుకుని లాగి నిలేసినట్టు చటుక్కున నిలబడిపోయింది.

"నిజంగానే నీ కేవీ చేతకాదా?"

ఆమెకు అర్థంకాలేదు. రెప్పల్ని ఎగరేసి ఏమిటి అన్నట్టు చూసింది.

"అదే.... ఏ ఒక్క కళలోనూ ప్రవేశం లేదా — నీకు. ఆఖరికి సాహిత్యంలో కూడా లేదా?"

కొద్దిక్షణాలు రెప్పల్ని వాల్చకుండా అతన్నే చూసింది.

అర్థమయ్యింది. ఉదయం ఆయన అడిగిన విచిత్రప్రశ్నల వెనక ఆయన హృదయంలోని ఉత్సుకత యిప్పుడు అర్థమయ్యింది. తనకేదో వచ్చుంటుందని ఎందుకనుకున్నారు. అంత కల్పన దేనికి? ఊహల్లోనే జీవిద్దామని తప్ప మామూలుగా జీవించడానికి ఎందుకు ప్రయత్నించరూ? ఆకాశంలో ఎగరడమే గాని భూమ్మీద నడవడం చేతకాదా? ఇలాంటి మనుషులు ఎలా బతగ్గలుగుతారు?

అతన్ని చూస్తే ఆమెకు జాలేసింది. అప్రయోజకుడైన కొడుకును చూసి కోపం రాకపోగా మరింత ప్రేమపొంగి, ఆలోచనలన్నీ అతన్నే అల్లుకుని, గొడుగు పట్టి చల్లని నీడల్ని కురిపించి సేదదీర్చి, మరీంతగా తన

కడుపుతీపిని పంచి ఇచ్చిన తల్లిమనసులా నాగావళి హృదయం కరుణతో తడిసి. చల్లటి ఆలోచనల్ని గాలులుగా అతనిమీదకు విసిరి అతని ఆకారాన్ని ఆమె కళ్ళలో నిలుపుని రెప్పలకింద భద్రంగా దాచుకుంది.

"మరీ అంత ఊహల్లో బతకడం మంచిదికాదు. లేవండి, భోంచేద్దురుగాని. అందరూ తినేశారు; మీరొక్కరే మిగిలారు, అవలా వుంచండి. నేను సర్దుతానుగానీ ముందు మీరు కదలండి."

అతను కదిలి వచ్చేవరకూ ఆమె అక్కడే ఎదురు చూస్తూ నిలుచుంది.

ఆమె వెనకనే వెళ్తూ 'ఇలా ఈమె శాసించడం ఏమీ బావుండలేదు; అబ్బే ఏమీ బావుండలేదు' అనుకున్నాడు.

అతని మనసంతా అదోలా అయిపోయింది. తను అద్దిన రంగుల్ని చెరిపేసుకుని నాగావళి అతనిముందు నిలుచునేసరికి మనసు చివుక్కుమంది. కింపడి రెక్కలు విరుచుకున్న పక్షిలా గిలగిల్లాడింది.

భోజనం దగ్గర మరీ పరధ్యానంగానూ, ఐశ్వర్యాన్ని కోల్పోయినవాడిలా కళావిహీనంగానూ కూర్చుని అతను భోజనం చేయడం నాగావళి చూసింది. వాళ్ళమ్మ అక్కడే వుండడంవల్ల ఏమీ మాట్లాడలేక పోయింది. భోజనం అయిపోయాక అతని గదిలో మంచినీళ్ళు పెట్టడానికని వచ్చి "బాధ పడుతున్నారు కదూ మీరు. మీ ఊహలకు తగ్గట్టు లేను. ఏం చేస్తాను, ఎందులోనూ ప్రవేశం లేకపోవడం అది నా దురదృష్టం" అంది. దుఃఖంలో తడిసి అక్షరాలు ఒకదానితో ఒకటి అంటుకుపోయిన స్పష్టత లేని బొంగురు కంఠాన్ని వినేసరికి అతను చలించిపోయాడు. అంతకుముందు ఎప్పుడూ ఆమె అలా కాలేదు. ఆమె కంఠాన్ని అలా వినడం అదే మొదటిసారి. చిరునవ్వుతో సాగిన పెదాలనో, అధికారంతో తెరుచుకున్న పెదాలనో, అప్పుడప్పుడు కోపంతో బిగుసుకుపోయిన పెదాలనో చూశాడుకాని దుఃఖంతో యిలా వణికిపోయిన పెదాలను చూడలేదు. అది అతను భరించలేకపోయాడు.

"బాధపడడంలేదు నాగావళీ! బాధపడాల్సిన అవసరంకూడాలేదు. నాకు కూడా ఏవీ చేతకావు. అందుకని నేనెప్పుడూ బాధపడలేదే. మనమంతా కళాకారులం కాలేం. కళను అర్థం చేసుకునే ఈస్తటిక్ సెన్స్ వుంటేచాలు. అంతకంటే అదృష్టం ఎందుకూ" అన్నాడు.

మంచినీళ్ళు పెట్టేసి నాగావళి వెళ్ళిపోయింది.

'నీకేమీ చేతగాకపోయినా నా జీవితాన్ని రసాత్మకం చెయ్యగలవు, చాలు' అనుకున్నాడు ఆ తర్వాత.

'శాసించడం మానుకోవాలి నాగావళీ. అందమైన ఎర్రని నీ నాజూకు పెదాలు అనురాగ స్వరాలు మీటడానికే తప్ప శాసించడానికి కాదు' అనుకున్నాడు తిరిగి.

నాగావళి అతని జీవితంమీదికి పొగమంచులా జారి, బిందువులుగా విడిపోయి, వెలుగుకిరణాల్ని అందుకుని, సప్తవర్ణాలుగా వికేంద్రీకరించి, ఆ విడిన రంగులను తిరిగి అతని జీవితం మీదనే కుమ్మరించి, రంగులు అద్ది మరింత అందంగా, శోభాయమానంగా తీర్చిదిద్దుతోంది. మరొకప్పుడు సరుగుడు తోటలోంచి వీచిన చల్లని గాలితెరలా అతని జీవితం మీదకు దిగి అతని ఆలోచనల కొసల్ని అందుకుని ఆకాశంలోకి ఎగిరి, అక్కడ మేఘాల మీద నిలిపి, దూరతీరాల్లోని రంగురంగుల పూలను చూపి గొప్ప అనుభవంతో నింపివేస్తోంది. ఇంకొకప్పుడు కెరటంలా వచ్చి అతని జీవితాన్ని చుట్టుముట్టి, ఉద్రేకంతో ఒక్క కుదుపు కుదిపి, పెకలించి, కదిల్చి సప్తవర్ణాలతో మెరిసే ఇసుక సింహాసనం మీద ప్రతిష్టిస్తోంది. కానీ అన్నిటినీమించి ఎక్కువగా తన వ్యక్తిత్వాన్నే గొడుగులా అతని జీవితంమీద పట్టి ఎండనీ, వాననీ అతనిమీద వాలనీకుండా కాపాడుతోంది.

కాని——

అతను అప్పుడప్పుడు వర్షంలో తడుస్తూ నడవాలనీ, ఎండలో తిరగాలనీ అనుకుంటాడు. ఆమె ఒదిలిపెట్టదు. అతనికి కోపంవస్తుంది. బాధ కూడా కలుగుతుంది.

ఇలా చాలా సార్లు జరిగింది.

వారం రోజుల తర్వాత అతనికి బేంకులో ఉద్యోగం దొరికింది. ఆ రోజు షికారుకు వెళ్లొచ్చిన సదానందతో "మీ కో మంచి వార్త చెప్తాను. నాకు ఏమిటిస్తారు?" అంది.

"నీ యిష్టమొచ్చింది కోరుకో యిస్తాను" అన్నాడు.

"అదే వొద్దు. అలా కలల్లో నిలుచుని మాట్లాడతారెందుకు, మామూలుగా మాట్లాడండి" అంది.

అతని మనస్సు చివుక్కుమంది. ఈమెకు తన మాటలే ప్రధానమా; హృదయం ప్రధానం కాదా? ఈ మాటల వెనక తన హృదయాన్ని గుర్తించదేం అనుకున్నాడు. మూతి ముడుచుకుని లోపలికి వెళ్ళిపోబోతూంటే కూడావచ్చి "పోనీలెండి; ఏ బహుమతీ యివ్వక్కరలేదుగానీ యీమాట ఆలకించండి—మీకు బేంకులో ఉద్యోగం వచ్చింది."

మరొకప్పుడైతే ఆనందంతో 'అలాగా! అయితే తప్పకుండా నీకు బహుమతి యివ్వాల్సిందే. రేపే నీకు ఫలానా వస్తువు బహుమతి యిస్తాను" అనేవాడు. కాని యిప్పుడలా అనాలనిపించలేదు. తన హృదయాన్ని గుర్తుపట్టనప్పుడు ఎందుకు దాన్ని బయటకు తీసి ప్రదర్శించాలి?

'ఆఁహా' అన్నట్టు తలమాత్రం ఊపాడు.

ఆమె దెబ్బతింది. అయినా తేరుకుని మామూలుగానే, "నాన్నగారు చెప్పారు మీకు వుద్యోగం వచ్చిందని. ఆ కాగితం వారిదగ్గరే వుంది. నిద్రపోతున్నారు గాబోలు పొద్దున్న చూద్దురుగాని" అంది.

ఏమైనా ఆరోజు ఉండాల్సినంత ఆహ్లాదకరంగా లేదు వాతావరణం.

సదానంద మంచిరోజు చూసుకుని ఉద్యోగంలో చేరాడు. మొదట్లో కొంత కొత్తగా వున్నా రానురాను అలవాటై పోయింది. టైముకు వెళ్ళడం, టైముకు రావడం. బేంకులో కూర్చున్నంతసేపే బాధ్యతలు. బైటికొస్తే మరే చింతా వుండదు. సాయంకాలం అలా ఏ సముద్రపు ఒడ్డునో కూర్చుని మెల్లగా యింటికి వచ్చేవాడు. భోంచేసి ఏ నవలో పట్టుకుంటే రాత్రి పన్నెండయిపోయేది.

"మరీ అంతరాత్రివరకూ మేల్కొని వుంటారెందుకూ? ఆరోగ్యం పాడౌతుంది." అని అనేకసార్లు నాగావళి కసురుకునేది. ఐనా వినేవాడుకాదు. కాస్సేపైనా చదవకపోతే నిద్రరాదు అనేవాడు. కోపంవచ్చి పుస్తకాలు పట్టుకు రావడం మానేసింది. ఎక్కడైనా లైబ్రరీలో చేరాడో ఏమో, తనే తెచ్చుకుంటుండేవాడు.

ఒక సారి మామ్ 'రైటర్స్ నోట్ బుక్' తెచ్చాడు. భోంచేసి పుస్తకం పట్టుక్కూర్చున్నాడు. రాత్రి పదయ్యింది. లైట్లు ఆరిపోయాయి వస్తాయేమో నని అర్ధగంటసేపు కాచుక్కూర్చున్నా ఎంతకీ రాలేదు. విసుగొచ్చింది. గత రోజు కూడా యింతే. మునిసిపాలిటీవారి మీద కోపం వచ్చి తిట్టుకున్నాడు కూడాను. లైట్ల గురించి ఎదురుచూస్తూ కూర్చుని చివరకు నిద్రపోయాడు. ఆ మర్నాడు బేంకులో పక్కసీటు ఆయనతో మునిసిపాలిటీవాళ్ళ చేతకాని తనాన్ని గురించి తీవ్రంగా చర్చించాడు. స్థానిక రాజకీయ వార పత్రికలో పాఠకుల లేఖావళికి ఒక వుత్తరం కూడా దీని మీద రాద్దామనుకున్నాడు. రాత్రి భోజనం దగ్గర ఈ విషయం నాగావళితో చర్చించాడు కూడాను.

ఏం లాభం. ఆ రాత్రి కూడా అట్లానే అయ్యింది.

పదింటికి లైట్లు ఆరిపోతే పంతం పట్టి గంటసేపు కూర్చున్నా లైట్లు రాలేదు. అయితే ముందు జాగ్రత్తపడి వచ్చేప్పుడు కొవ్వొత్తులు కొనుక్కుని వచ్చాడు. ఒకటి వెలిగించి కూర్చున్నాడు. ఆ వెలుతురు కింద చదవడం సాధ్యం కాలేదు. కళ్ళుమండాయి. వీధివరండాలోకి వచ్చాడు. సిగరెట్టు కాల్చుకుందామని అగ్గిపుల్ల వెలిగించేసరికి నడవా కిటికీ వెనక గాజులచప్పుడు వినిపించింది. అటు చూశాడు. పక్కకు తప్పుకున్న అస్పష్టమైన ఆకారం ఒక క్షణంపాటు కనిపించి మాయమైపోయింది.

నాగావళే! ఆ బుట్టలోలకులు ఆమెవే. ఇంత రాత్రివరకూ నిద్ర పోలేదా! ఏం చేస్తోంది?

చటుక్కున మెరుపులా ఓ ఆలోచన తట్టి అవతలికి వెళ్ళి చూశాడు. ఆ యింటికి అటూ యిటూ వున్న యిళ్ళల్లో దీపాలు వెలుగుతూనే వున్నాయి. ఇవతలి యింట్లో అంతా నిద్ర పోతున్నారు కాబోలు. ఒగదిలో మాత్రం అతి నీరసంగా, రోగిష్టివాడిలా నీలంరంగు బెడ్‌రూంలైటు వెలుగుతోంది. అవ తలి యింట్లో యింకా నిద్ర పోలేదేమో ట్యూబులైటు వేసివుంది.

ఆతనికి అర్థమయింది. ఇది నాగావళి పనే. ఇంట్లో మెయిన్ ఆపే స్తున్నట్టుంది. ఎందుకిలా చేస్తోంది? తనచుట్టూ హద్దుల్ని ఎందుకు గీస్తోంది? కొన్ని విషయాలలో తనంతటతాను కల్పించుకుని తల దూర్చినా అందం

వుంది. ప్రతీదీ పట్టించుకోవడం ఏమీ బావుండలేదు — నాగావళిమీద కోపమే కాదు చాలా చిరాకు కూడా వచ్చింది.

సిగరెట్ల విషయంలో కూడా ఇంతే జరిగింది. అతనికి సిగరెట్లు కాల్చే అలవాటు వుంది. ఎక్కువగానే కాలుస్తుంటాడు. ఈ పూరొచ్చింతర్వాత మరీ ఎక్కువయ్యింది. నాగావళి చూసినా అట్టే పట్టించుకోలేదు.

ఒకరోజు పనిమనిషి రాకపోతే నాగావళే వెళ్ళి అతని గది ఊడ్చింది. అప్పుడు పోగైన సిగరెట్టు పీకలు చూసేసరికి ఆమెకు ఆశ్చర్యమేకాదు కోపంకూడా వచ్చింది.

"మీ పద్ధతేమీ నచ్చలేదు. ఒక్క రాత్రిలో యిన్ని సిగరెట్లా. ఈ లెక్కన రోజుకి ఎన్ని పేకెట్లు తగలేస్తుంటారు. ఏమీ తోచకపోతే ఏ ఒకటో రెండో కాల్చినా అర్థంవుంది. మరీ యిన్నటండీ! ఇలా రాత్రుళ్ళు నిద్రపోక సిగరెట్లు తగలేస్తూ కూచుంటే ఎప్పుడో ఒకప్పుడు ఒంటికి తెచ్చుకునేట్టే వున్నారు'' అంది. టేబిలుమీద సిగరెట్టు పెట్టె వుంటే తీసి చింపేసి, సిగరెట్లను చిదిమి పారేసింది.

నాగావళి కోపం ప్రదర్శించినా నవ్వొచ్చేట్టుగానే వుంది. పెట్టెను ముక్కలు ముక్కలుగా చింపేసి సిగరెట్లను చిదిమిపారేయాలన్న పొడుగాటి నాజూకైనవేళ్ళ కంగారు, పిడికిలి బిగింపులో కసి, వాసనని భరించలేక అసహ్యించుకుంటున్న చిట్లించిన నాసికాపుటాలు, బలాన్ని ఒకేచోట కేంద్రీకరించి. సడలిపోకుండా బిగపట్టిన పెదాలు, మాటిమాటికీ అతని ముఖంలోని మార్పులను కొలుస్తూ ఎగిరే చూపులు యివన్ని చూసేసరికి అతను నవ్వాపుకోలేకపోయాడు.

అతను నవ్వుతూంటే ఆమెకు ఉక్రోషం వచ్చి, తుడిచిన తుక్కు అయినా ఎత్తకుండా ఎక్కడిదక్కడే ఒదిలేసి వెళ్ళిపోయింది.

'బావుంది. చాలా బావుంది. అసహాయతలోంచి వచ్చిన కోపంలో మరీ అందంగా వుంటుందిసుమా'—అనుకున్నాడు.

అప్పటినించీఅతను సిగరెట్టుపెట్టెగాని, అగ్గిపెట్టెగాని బయటవుంచేవాడు కాదు. ఉంచేస్తే చింపి పారెయ్యకుండా ఆమె వదిలిపెట్టేదీ కాదు. మొదట్లో

ఆమె చింపిపారేస్తోంటే అందంగానే అనిపించేది కాని, రాను రాను చికాకు కలుగుతుండేది. ఇదికూడా తనను శాసించడమే అని అనిపించింది అతనికి.

'అవును. ఇది శాసించడంకాక మరేమిటి? తన స్వేచ్ఛకు హద్దుల్ని ఏర్పరచడం తనమీద అధికారాన్ని చెలాయించడం కాదూ. చాలా తెలివిగా శాసిస్తోందే! తనకు తెలియకుండా తనను కట్టిపడేయాలని చూస్తున్నట్టుంది. తనదైన వ్యక్తిత్వం తనకు లేకుండా చేస్తోంది యీమె–' అనుకున్నాడు.

రోజూ ఏదో ఒక సంఘటన జరుగుతూనే వుంది. ఆమె ప్రతి పలుకూ తనను శాసించడానికే, ఆమె ప్రతిచర్యా తనను కట్టిపడేయడానికే అన్నభావం అతనిలో మరీ బలపడిపోయింది. ఆమె మీద చిరాకూ, కోపమూ వస్తున్నాయి. ఆ విషయం ఆలోచిస్తోంటే ఒక్కొక్కప్పుడు అతనికే ఆశ్చర్యంగా వుండేది.

సదానంద తొలిజీతం అందుకున్నాడు. తన ఖర్చులకింద కొంత డబ్బు రాఘవరావుగారికిస్తే ఆయన పుచ్చుకోలేదు.

"ఈ నెలనించేకదోయ్ సంపాదనలో పడ్డావు. వొచ్చే నెలనుంచి చూద్దాంలే. ఇంటికి పంపించు" అన్నారు ఆయన.

ఇంటికి డబ్బు పంపించడంకన్నా తల్లికీ, అక్కకూ బట్టలు తీసి పంపిస్తే బావుంటుం దనిపించింది. చీరలుగురించి తనకు తెలీదుకదా. ఎట్లా?_ అనుకుంటుండగా చటుక్కున నాగావళి జ్ఞప్తికి వచ్చింది. ఆమెకు ఆ విషయం చెప్పాడు.

"అలానేలెండి. రేపు ఎలాగూ మేం బజారుకు వెళ్ళదలచుకున్నాం. స్నేహితురాలు ఏవో బట్టలు తీసుకుంటానంది. నేను కూడా జాకెట్టు గుడ్డలు తీసుకోవాలి. రేపు ఆఫీసునుంచి నేరుగా ఇంటికొచ్చేస్తే యిక్కడ్నుంచి కలిసి వెళ్ళొచ్చు." అంది,

"నేనెందుకూ మళ్ళీ. మీరిద్దరూ ఎలాగూ వెళ్తున్నారుకదా. మీరే తెచ్చెయ్యండి" అన్నాడు.

"తెచ్చేస్తాలెండిగాని తమరూ రండి. ఫరవాలేదు" అంది నాగావళి.

ఆ మాటలు విన్న తర్వాత అతనికే సిగ్గేసింది. మరేమీ మాట్లాడలేక పోయాడు.

మర్నాడు సాయంకాలం ఆఫీసునుంచి తిన్నగా యింటికే వచ్చేశాడు. నాగావళి స్నేహితురాలు కూడా వచ్చింది. యింట్లో చెప్పి బజారుకు బయలు దేరారు.

వాళ్ళు తరచుగా బట్టలుకొనే దుకాణం ఒకటుంది. అక్కడకు వెళ్ళారు. నాగావళి స్నేహితురాలు పి. డబ్ల్యు. డి. ఇంజనీరుగారి అమ్మాయి. కాస్త పెద్ద ఎత్తునే బట్టలు ఖరీదుచేసింది. అంత పెద్ద ఎత్తున ఖరీదుచేసిన అమ్మాయి పక్కనే బ్లౌజు పీసులు ఖరీదుచేస్తున్న నాగావళిని చూస్తే అతనికి జాలే సింది. అక్కకూ తల్లికీ చీరలు సెలక్టు చేయించి తీసుకుని, నాగావళికికూడా ఒకటి తీసుకోబోయాడు. "నా కెందుకూ చీర. కొని, యింకా వాడని కొత్త చీరలే రెండో మూడో పెట్లో వున్నాయి. కిందటి నెల్లోనే మేమిద్దరమూ వచ్చి ఓ చీర కొనుక్కెళ్ళాం. వొద్దు తియ్యకండి" అంది. ఆ చీర లోపల పెట్టించే సింది

సదానంద కూడా తనకేవైనా బట్టలు తీసుకుందామనుకున్నాడు. ఫేంటు గుడ్డలు చూస్తోంటే నాగావళి "ఇవేమిటిగాని మీకు లాల్చీ షరాయి చాలా చక్కగా నప్పుతుంది - అవి తీసుకోండి" అంది.

"నా కవి నచ్చవు. కళాకారుడి వేషం వేసినట్టుంటుంది."అన్నాడు.

"లేదు. అవి మీకు చాలాబాగా సరిపోతాయి సన్నటి వాళ్ళకు లాల్చీ షరాయి బావుంటుంది. ఓ జత కుట్టించుకుని చూడండి." అంది తిరిగి.

"వొద్దులెద్దూ. నాకు నచ్చదది." అనేశాడు.

"అది కాదు. ఒక్క జత కుట్టించుకుని చూడండి. మీకు చాలా బావుం టుందంటే నమ్మరేం." అని ఆ వెంటనే "ఏదయ్యా లాల్చీ షరాయిలకు మంచి గుడ్డవుంటే చూపించు." అంది కొట్లో గుమాస్తాతో. రెండు మూడు రకాలు చూసి ఒరకం పైకి తీసి "ఇది బాగున్నట్టుంది కదూ!" అనీ సదానందకు చూపించింది.

నాగావళి ప్రవర్తన సదానందకు చాలా చికాకు కలిగించింది. అప్పటికే కొట్టువాడూ, గుమాస్తాలూ వాళ్ళ సంభాషణని ఆలకించారు. నాగావళి స్నేహితు రాలుకూడా పెదాల్ని బిగబెట్టి నవ్వాపుకుంటోంది. అవన్నీ సదానంద గుర్తిం

చాడు. అతనికి చిరాకు వేసింది. 'ఇప్పుడొద్దు, తర్వాత తీసుకుంటాలే' అని అందామనుకున్నాడు గాని అప్పటికే నాగావళి ఆయనకు ఎంత గుడ్డ కావాలో లెక్కగట్టి చింపి యిచ్చెయ్యమని ఆర్డరు యిచ్చేసింది.

ఆ కొట్టు అరుగుమీదే ఓ మిషను పెట్టుకుని టైలరు ఒకడు వున్నాడు. అతనికి ఇచ్చేసి కొలతలు తీసుకోమంది నాగావళి. "మళ్ళీ ఎక్కడికో వెళ్ళడం ఎందుకూ. యీయన కిచ్చేస్తే యీయనే కుట్టేస్తాడు. నాన్నగారుకూడా యితని దగ్గరే కుట్టించుకుంటారులెండి. బాగానే కుడతాడు. కొలతలు ఇవ్వండి." అంది సంజాయిషీ యిచ్చుకుంటున్నట్లు సదానందతో.

సదానందకు సహనం సన్నగిల్లి పోతోంది. అనవసరంగా అక్కడ అల్లరి పడడం యిష్టంలేక మౌనంగా కొలతలు యిచ్చేశాడు.

ఆ కొట్లో ఎక్కువసేపు వుండబుద్దేయలేదు అతనికి. అక్కడ అందరి చూపులూ తనమీదే వున్నట్టనిపించాయి. బిల్లు చెల్లించేసి బయటపడ్డాడు.

"ఇంటికేనా?" అంది నాగావళి.

అతను సమాధానం చెప్పకుండా నడుస్తున్నాడు.

ఆమె తనలో తనే నవ్వుకుంది.

కొంతదూరం వెళ్ళిన తరువాత 'తనకు పనుందని, అటు వెళ్ళాలని' గాలికి చెప్పినట్టు చెప్పి గబగబా అడుగులు వేసుకుంటూ మరోవైపు వెళ్ళిపోయాడు సదానంద. అలా వెళ్లి వెళ్లి సముద్రపుటొడ్డు కొచ్చి కూర్చున్నాడు.

ఎదుటివారి యిష్టాయిష్టాల్ని ఎందుకు గుర్తించదీమె? ఇతరులకు కూడా వ్యక్తిత్వాలు వుంటాయనీ, వాటిని గౌరవించాలనీ యీమెకు తెలీదా? ఇతరుల వ్యక్తిత్వంమీద తన ప్రభావాన్ని ప్రసరింపచేయడం స్వార్థపరుల లక్షణం అని ఎందుకు గుర్తించదు? ఆ బలవంత మేమిటి? ఆ అధికారాన్ని ఎవరిచ్చారు? జీవన సామ్రాజ్యంలో మహారాజ్ఞి అవుతున్నంత మాత్రంచేత ఆ జీవితాన్ని శాసించడానికి పూనుకోవడం తెలివైన పనికాదు. శాసించేకంఠాన్ని తను భరించలేడు. ఇతరుల వ్యక్తిత్వపు నీడల్లో నిలబడడం తనకు యిష్టంలేదు. స్వేచ్ఛాజీవితానికి అలవాటుపడిన తను ఏ పరిధుల మధ్యా ఆనందంగా జీవించలేడు. జీవించగల ననుకోవడం ఆత్మవంచనే- అనుకున్నాడు.

అతని మనసంతా కకావికలుగా అయిపోయింది. ఇంతకాలంగా అతను హృదయంలో నిలుపుకున్న రూపం మంచులా కరిగి నీరుగారిపోయింది. అక్కడ ఆతనికొరకు మిగిలిందేమీ లేదు. తన సర్వస్వమూ కోల్పోయిన వాడిలాగ అతను బాధపడ్డాడు.

రాత్రి బాగా పొద్దుపోయే వరకు అతను ఆలోచనల్లోనే గడిపి మెల్లగా యింటిని చేరుకున్నాడు.

నాగావళి మేలుకునేవుంది. తలుపు తట్టితే వొచ్చి తలుపు తీసింది. ఆవిడే భోజనం కూడా వడ్డించింది. చాలా ముభావంగా భోంచేసి లేచిపోయాడు. గదిలో కొచ్చి కొవ్వొత్తి వెలిగించి, ఏదో రాసుకుంటూ కూచున్నాడు. నాగావళి మంచినీళ్లు పెడదామని వొచ్చి చూసి, కరెంటు దీపం వెలిగించి వెళ్లిపోయింది. ఆ వెనకనే లేచొచ్చి కరెంటుదీపం ఆర్పేసి, కొవ్వొత్తి కరిగికరిగి చీకట్లో మునిగిపోయేవరకూ దాన్నే చూస్తూ కూర్చుని, నిద్రపోయాడు.

ఉదయం రాఘవరావుగారితో "మధ్యాహ్నం బండికి వూరెళ్లుతున్నానండీ. నిన్ననే మా అమ్మ వుత్తరం రాసింది ఓ సారి రమ్మనమని" అన్నాడు.

"అప్పుడే యింటిమీద బెంగెట్టేసుకున్నావుటోయ్! భలేవాడివే." అని ఓవిట్టు విసిరి, విసిరినందుకు నవ్వుకుని "సర్లే వెళ్లిరా. నిన్న మీ అక్కయ్యకీ, అమ్మకీ బట్టలుకూడా తీసుకున్నావటగా, మంచిపనేచేశావ్. తొలిజీతం అలాగే చెయ్యాలి. నేనూ చిన్నప్పుడు యింతే చేశాను. అది సరేకాని అక్కడ ఎక్కువ రోజులు వుండిపోక. కొత్త వుద్యోగంకదా బావుండదు." అన్నాడు ఆయన. ఆఫీసుకు వెళ్లిపోతూ ''ఎక్కువ రోజులు వుండిపోకుండా త్వరగా వచ్చెయ్. వీలయితే మీ అమ్మను కూడా తీసుకురా'' అని మరోసారి హెచ్చరించాడు.

సామాను సర్దుకుంటుండగా నాగావళి వచ్చింది.

''వూరు వెళ్తున్నారా....నిన్న మాట మాత్రంగానైనా చెప్పలేదేం?" అంది.

''పొద్దున్న చెప్పాగా. మీ నాన్నగారితో చెప్తున్నప్పుడు నువ్వూ విన్నట్టున్నావు కదూ.''

"అంతేనా? అంతకన్న ప్రత్యేకంగా చెప్పాలనుకోలేదా మీరు.''

"ఎందుకనుకోలేదూ. తప్పకుండా నీకు చెప్పే వెళ్తాను. అలా చెప్పాల్సిన అవసరంకూడా వుంది.''

నాగావళి అనుమానంగా చూసింది. అతను చూపులు మార్చుకున్నాడు.

"భోజనం వడ్డించేస్తావా, బండికి టైమయినట్టుంది.''

"అలాగే....రండి" అంటూ వెళ్లిపోయిందామె.

భోజనం చేసి, కాస్సేపు కూర్చుని యింట్లో అందరికీ చెప్పి బయలు దేరాడు. బయలుదేరేముందు నాగావళికి మళ్ళీ మరొకసారి చెప్పి "మీ స్నేహితు రాలికి కూడా చెప్పు. అన్నట్టు ఆమె పుస్తకాలు యిచ్చేసెయ్ ఇచ్చేముందు అందులో ఏమైనా రూపాయలు వున్నాయేమో ఓసారి చూడు. పుస్తకాల మధ్య నోట్లుపెట్టే పాడు అలవాటు నాకుంది.... వస్తామరి....మర్చి....''

రిక్షా అలా కదలడంతోనే నాగావళి గబగబా అతని గదిలోకి వెళ్లింది. కంగారుగా పుస్తకాలన్నీ తిరగేస్తోంది. రూపాయలు వుండవని ఆమెకు తెలుసు. ఏదో విశేషం వుండాలి. లేకపోతే ప్రత్యేకించి యీ విషయం చెప్పడం ఎందుకు? వేళ్లు ఆత్రుతగా పేజీల్ని తిప్పుతున్నాయి. గుండెకూడా గబగబా కొట్టుకుని కదిలే వేళ్ళకు తాళం వేస్తోంది. అకస్మాత్తుగా ఆమె చూపులు నిలిచిపోయాయి. ఓపుస్తకంలో మడతపెట్టిన కాగితం! పైన నాగావళి పేరు!

కొద్ది సెకనులు గుండె కొట్టుకోవడం మానేసి మళ్ళీ ప్రారంభించింది.

ఆతృతగా కాగితం మడతలు విప్పింది.

'నాగావళీ—

బానిసత్వం ఎరగనివాడ్ని. చిన్నప్పటినుంచీ స్వేచ్ఛగా పెరిగినవాడ్ని. ఎప్పుడూ ఎవరి అదుపాజ్ఞల్లోనూ వుండలేదు. ఎవరి నీడలోనూ పెరగలేదు. చాలా స్వతంత్రంగా జీవించాను. ఎదుటివారి ఆధిక్యతని వొప్పుకుంటానుగాని తలవంచలేను. ఇంట్లోకాని, స్కూల్లోకాని ఎప్పుడయినా ఎవరయినా అధికా రాన్ని చెలాయించడానికి ప్రయత్నిస్తే పడేవాడినికాదు. పరిధులు గీసి, ఆ పరిధుల మధ్య నన్ను నిలబెట్టటానికి ప్రయత్నించే వాళ్ళంటే నాకు తగని చిరాకు. అధికారంతోగాని, అభిమానంతోగాని ఎవరయినా నన్ను కట్టిపడేయా లని చూస్తున్నట్టు అర్థమైతే మళ్ళీ వారి దగ్గరకు వెళ్ళేవాడిని కాదు. అలా నా వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటూ వచ్చాను. దీనిపై యితరుల ప్రభావం పడడం నాకిష్టంలేదు. నాదైన వ్యక్తిత్వం నాకు వుండాలని నా ఆరాటం.

నాగావళీ! నేను అందగాడ్ని కాకపోయినా అందమైన అమ్మాయిని నా జీవితంలోకి తెచ్చుకోవాలని స్వార్థపరుడిగా కలలుగన్నాను. నిన్ను చూసిన తర్వాత ఎన్నో ఊహల్ని అల్లుకున్నాను. అదృష్టవంతుడ్నని మురిసిపోయాను. జీవితాన్ని అడుగడుగునా రసమయం చేసుకోవచ్చని ముచ్చటపడ్డాను. కాని నువ్వు అభిమానంతో కట్టిపడేయాలని చూశావు. ప్రేమతో శాసించడానికి ప్రయత్నించావు. నా వ్యక్తిత్వాన్ని కూడా గౌరవించాలనే విషయాన్ని విస్మరించావు. నేనది సహించలేకపోయాను.

ఇప్పటికీ నీ అందాన్ని మెచ్చుకుంటాను. నీ అభిమానానికి కృతజ్ఞత చెప్పుకుంటాను. ఎన్నోసార్లు ఎన్నోరకాలుగా బాధపెట్టాను నిన్ను. నువ్వు నా జీవితాన్ని శాసించడానికి ప్రయత్నిస్తున్నావని తెలిసి, కావాలని నీకు బాధ కలిగేటట్టు ప్రవర్తించాను. నన్ను క్షమించు.

ప్రేమతోనైనా శాసించబడడం ఇష్టంలేదు నాకు.

అందుకనే నీ నీడనుంచి తప్పుకుని వెళ్ళిపోతున్నాను. నీకు బాధ కలిగించినందుకు మరోసారి క్షమాపణ చెప్పుకుంటున్నాను.

—సదానంద'

నాగావళికి దుఃఖం ఆగిందికాదు. పెదాల్ని బిగబట్టి ఎంతగా ఆపుకోవాలని చూసినా సాధ్యం కాలేదు. చెక్కిళ్ళు తడిసిపోయాయి. అరగంట వరకూ ఆ గదిలోంచి బైటికి రాలేకపోయింది. ఆరోజల్లా తలనొప్పిగా వుందని మంచంలోంచి లేవలేదు.

కూతురి వాలకాన్ని చూసి ఏదో జరిగివుంటుందని తల్లీ, తండ్రీ పసిగట్టి అడిగారు గాని ఆమె ఏమీ చెప్పలేదు. 'ఏమీ లేదు....ఏమీలేదు' అనేసింది. చివరికి రాఘవరావుగారే అతి లౌక్యంగా సదానంద తల్లి పేరున వుత్తరం రాశారు- 'ఇప్పుడు అబ్బాయి చేస్తున్న వుద్యోగం చాలా మంచిది. ఎం.ఏ. చదువులు చదువుకున్న వాళ్లుకూడా దానికి ఎగబడుతుంటారు. ఆ ఉద్యోగం మన అదృష్టం కొద్దీ దొరికింది. అబ్బాయి చేరి నెలరోజులన్నా కాలేదు ఇంటిమీద ధ్యాస పుట్టిందంటే సరే వెళ్లి రమ్మన్నాను. ఎక్కువ రోజులు అక్కడ

వుంచక సాధ్యమైనంత త్వరలో అబ్బాయిని పంపించేస్తే మంచిది. అబ్బాయితో పాటు మీరూ రండి; వారం రోజులుండి వెళ్లుదురుగాని. మనవాళ్లు చాలామంది వున్నారిక్కడ. వీళ్ళందర్నీ చూసినట్టూ అవుతుంది— అని.

ఆ ఉత్తరం సదానందే అందుకున్నాడు. చదువుకుని నవ్వుకున్నాడు. దానితోపాటు కవరు కూడా ఒకటి వచ్చింది. పైన హేండ్ రైటింగ్ కొత్తగా వుంది. చించి వుత్తరం బైటికి తీశాడు. చిన్నదే. అడుగున నాగావళి సంతకం వుంది. చదువుకున్నాడు.

"శ్రీ సదానందగారికి నాగావళి హృదయ పూర్వకంగా నమస్కరించి వ్రాయునది,

మీరు వొదిలిపెట్టి వెళ్ళిన వుత్తరం చూశాను. నేను దురదృష్టవంతు రాలినని తెలుసుకున్నాను. బాధ పడ్డాను. నిజానికి యీ వుత్తరం రాయాలనుకోలేదు. కాని మీ వుత్తరంలోని ఒక విషయానికి సమాధానంగా యిది రాయక తప్పలేదు.

మీరు మీది అనుకుంటున్న వ్యక్తిత్వం మీదికాదు. అసలు మీకు ఒక వ్యక్తిత్వం అంటూ స్థిరంగా ఏదీలేదు. మరీ మంచివాళ్ళకూ, అమాయకులకూ ఒక స్థిరమైన వ్యక్తిత్వం అంటూ వుండదు. ఎప్పటికప్పుడు అది మారిపోతూ వుంటుంది. ఎదుటివారిని బాధపెట్టడం యిష్టంలేక తమ అభిరుచుల్ని మార్చుకుంటూ పోతుంటారు. దాన్ని బట్టే వ్యక్తిత్వాలు కూడా మారుతూ వుంటాయి. అలా మారడం తప్పేమీ కాదు. మీ వ్యక్తిత్వం మీద యితరుల ప్రభావం పడుతున్నదని బాధపడిపోవలసిన పనేమీ లేదు.

మొట్టమొదట మీ నీడలోనే నేను వుందామనుకున్నాను. కాని మీ మీదనే గొడుగు పట్టాల్సిన అవసరం వుందని తెలుసుకున్నాను. అంతటా సౌందర్యాన్నీ, మంచితనాన్నీ చూసే మీకు ఊహల్లో విహరించడం తప్ప భూమ్మీద నడవడం చేతకాదు. అందువల్ల ఎప్పుడూ నీడలా అంటిపెట్టుకునే మనిషి అవసరం మీకు.

మిమ్మల్ని శాసించాలన్న అధికార మనస్తత్వం కానీ, కట్టి పడేయాలన్న స్వార్థంకానీ నాకు లేవు.

మీ చుట్టూ ఎన్నో ఆశల్ని అల్లుకున్నాను. కానీ మీరు దూరంగా పారిపోయారు. ఏం చేస్తాను — నా అదృష్టం అంతంత మాత్రంగానే వుంది. కాని మీకు నా సలహా ఒకటి వుంది. ఎప్పుడైనా మీరు పెళ్ళిచేసుకోదలిస్తే మిమ్మల్ని శాసించగలిగే ఆమెనే పెళ్ళిచేసుకోండి. మీ అంతట మీరు ఏ పనీ చెయ్యలేరు. ఎవరో లాలించి, అవసరమైతే కసిరి కోప్పడి మీచేత ఆ పని చేయించాలి అందువల్ల మీకు మేలేకాని నష్టం కలుగదు—ఉంటాను మరి.

— నాగావళి"

ఆ ఉత్తరం మళ్ళీ చదువుకున్నాడు. ఇంకొకసారి కూడా చదువుకున్నాడు. సాయంకాలం కోనేరు గట్టుమీదకెళ్ళి చీకటి పడేవరకూ ఆ వుత్తరాన్ని ముందుంచుకునే కూర్చున్నాడు. చివరకు ఆలోచనలన్నిటినీ అదే వుత్తరంలో మడతపెట్టి, జేబులో పెట్టేసుకుని ఇంటికొచ్చి, బేంకు వాళ్ళకు వుత్తరం రాశాడు—అర్జంటు పనివల్ల స్వగ్రామం రావలసి వచ్చిందనీ, సెలవు దరఖాస్తు పెట్టడానికి కూడా వ్యవధి లేకపోయిందనీ, అందువల్ల పోస్టులో పంపిస్తున్నాననీ, అయిదు రోజులు సెలవు యిప్పించవలసిందనీ వ్రాసి, ఆ రాత్రికి రాత్రే పోస్టు చేశాడు సదానంద.

(1967)

★